# కవితా కౌముది

## గాలి పటం

-జి.సుబ్బారావు.

ఆట మైదానంలో
అంతా కోలాహలం
వేసవి శెలవుల్ని పిల్లలు
గాలి పటాలుగా ఎగరేసుకుంటున్నారు
నాకూ ఎగరెయ్యాలనుంది. . . . .
గాలి తోడై దారం సాగే కొలదీ
గాలిపటాలు
తోక మీద లేచి పడగ విప్పిన
కోడె త్రాచులై ఆడుతున్నై
ఆ వయసులో నేనూ-
సాయంవేళ చల్లగాలికి
గాలి పటాన్నై
గాల్లో పల్టీలు కొట్టేవాణ్ణి
గాలి పాటనై
ఆకాశపుటంచులకి సాగిపోయేవాణ్ణి!
ఏ కుర్రాడైనా తన గాలి పటాన్ని
నా చేతికిస్తే బాగుండును..



తాడు తెగిన ఓ గాలిపటం
కొట్టుకు పోతున్నది గాలికి
ఎక్కడ ఏ చెట్టు కొమ్మల్లో చిక్కుకుంటుందో

దాన్నే చూసుకుంటూ పరుగెత్తే కుర్రాడు
బోర్లా పడ్డాడు రాయి తగిలి..
గాలందకో, బాలెన్స్ కుదరకో ఓ గాలిపటం
తోక తెగిన త్రాచులా
కొట్టుకుంటున్నది నేల మీద!

నేనిప్పుడా గాలి పటాన్నే అచ్చం!
తూకం కుదరని నడకతో
సహకరించని కాళ్ళతో . . .
అయినా-
వయసుకీ శరీరానికీ
అతీతమైన శక్తేదో
నన్ను గాలి పటాన్ని చేస్తున్నది
గాల్లోకి లేపుతున్నది.

శ్రీ సుబ్బారావుగారు, తూర్పుగోదావరి జిల్లా కొత్తపేటలో రిటైర్డ్ పోస్ట్‌మాస్టారు. గత 15 సంవత్సరాలుగా అక్కడ 'కళాసాహితి' సంస్థను నిర్వహిస్తున్నారు. 'వెలుతురు జలపాతం', 'బియ్యపుగింజ' కావ్యాలను రచించారు. కావ్యవిమర్శ ఇష్టమైన ప్రక్రియ.

ఏప్రిల్ ౨ న, కాలిఫోర్నియా, లివర్ మోర్ దేవాలయంలో సిలికానాంధ్ర నిర్వహించిన శ్రీపార్థివ ఉగాది ఉత్సవం - స్వర సాహితీ సమ్మేళనం లో పాల్గొన్న కవులు చదివిన కొన్ని స్వీయ కవితలు - మరికొన్ని కవితలు వచ్చేనెల..

## స్వాగతమో పార్థివా!

- డాక్టర్ పి.వి.సుబ్బారావు.

సీసము

స్వాగతమో! నూత్న సంవత్సరమ్మా!
　　సుస్వాగతమో! పార్థివమ్మ! నీకు
'తారణ' హృదయ విదారణ మౌ రీతి
　　జనుల ఛీత్కారాల సాగిపోయె
సామాన్య రైతుల సంకటాలు పెరిగి
　　ఆత్మ హత్యల పర్వమధికమయ్యె
ఉగ్రవాదంపు మహోగ్ర జ్వాలల ప్రజా
　　జీవనం బెల్లను ఛిద్రమయ్యె
స్వాగతింతు నిన్ను సంప్రీతియలరంగ
పార్థివమ్ము రమ్ము ప్రజల బ్రోవ
రాశి ఫలము భవిత రస రమ్యమౌగాక
కవుల కవిత శుభము కలుగు గాక!



Click here to watch Video

సీసపద్యమాలిక

రక్త పాతము హింస రాజ్య మేలుట గాక
　　శాంత్య హింసలు పృథ్వి సాగునట్లు
కర్షక జనులెల్ల హర్షమేపారంగ
　　కూడు గుడ్డలు గూడు కొదవ లేక భువిని
బడుగు పేదలు తృప్తి బ్రతుకునట్లు

స్కాముల అవినీతి స్వాముల లీలలు
నిలువరించు నీతి నిలుపునట్లు
మోడు వారిన చెట్ల మోదాన చిగురించి
    కొమ్మ రెమ్మలు తోడ కులుకునట్లు
బ్రతుకు తీపెరుగక వ్యథల చేదును మ్రింగి
    నిట్టూర్చు జనులకు నేస్తమట్లు
నేతల అవినీతి చేత లెల్ల నశించి
    జన హిత పాలన సాగునట్లు
ఉద్యోగ ప్రాప్తికై ఉద్యమించు 'యువత'
    స్ఫూర్తితో విజయమ్ము పొందునట్లు
తెలుగు వత్సరాది తేజమ్ము దీపింప
పార్థివమ్ము ప్రగతి పథ రథాన
శుభ పరంపరాళి స్ఫూర్తితోతేవమ్మ
జగతి ప్రగతి కొరకు జయము తోడ

మధ్యాక్కర    కోకిల మధుర స్వరాలు గున్న మావిచిగురు లేవి?
కాకుల చీకాకు రొదలు కరకు యంత్రధ్వనుల్ తప్ప!
ఈ 'కలి' యంత్ర కాలు'ష్య'మే నగరాల వసించు
సాకల్యమౌ వసంత ఋతు సౌందర్యమెట్లు భాసించు?

తేటగీతి    తెలుగు మేధస్సు భువి నలుదిశల వెలుగు
తెలుగు సంస్కృతి దివ్యమై తేజరిల్లు
విశ్వవిఖ్యాత మధురమై వెలుగు తెలుగు
వెలుగు అమెరికా నుదుటికి తెలుగు బొట్టు

మధ్యాక్కర

జయ "సిలికానాంధ్ర" సంఘ సభ్యులారా! ధన్యులార!
జయమౌ ప్రవాసాంధ్రులార! సరస సంస్కృతి ప్రియులార
జయము నిర్వాహకులార! జయ సాహితీ ప్రియులార!
జయములతో 'పార్థివ' సుఖ సంతోషముల బ్రోచు మిమ్ము.

డాక్టర్ సుబ్బారావు గారు చిలకలూరిపేట ప్రభుత్వ కళాశాలలో తెలుగు శాఖాధిపతిగా పనిచేస్తున్నారు. అనిశెట్టి కవిత్వం గురించి రాసిన పరిశోధనా పత్రానికి డాక్టరేట్ పట్టా పొందారు. స్వీయ కవితా సంకలనాలతో బాటుగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కావలసిన తెలుగు మర్గదర్శక గ్రంధాలను కూడా ప్రచురించారు.

## ముడిసరుకు

రమానాథ్ కందాళ

ఉగాదట ! కవితలట ! కావాలట ! కవి గారికి !
పోటీ కానే కాదట కానీ ఆటే సమయం లేదట !
ఏమని రాయను? ఏముందని రాయను?
పెద్దన సత్కవిలా రాద్దామని కూచున్నా
కనబోయే పసికవితని ఒడిలో ఊహించుకుని,
కావలసిన ముడి సరుకుని కనులు మూసి తలచుకుని
దీక్షగా అపేక్షగా అక్షర లక్షలకై నిరవధిక నిరీక్షగా !..

రమణీ ప్రియ దూతిక రాదేం?
కమ్మని కప్పుర విడెమిక తేదేం?
హాయగు ఊయల మంచం లేదేం?
సుఖ భోజన సదుపాయం కాదేం?
వలసినదేదీ కానీ వలచి ఒడిని వాలకుంటె
సారణులూ సరిత్తులూ సాగరాలు సరేసరి

ఉబికే కవితా ఝరి ఉద్ధరిణెకైన సరిపోదే

ఏమని రాయను? ఏముందని రాయను?

కనులుమూసి కూచుంటే కనబడ్డది
కలువకళ్ళ కాంతామణి కాదు
శిశిర వాత ఘాతం తో చివరి శ్వాశ విడిచేసి
పెరడున మోడై నిలిచిన కధా కల్పశాఖి !
వాడుక కడు వేడుక అయి పొదుగు వట్టిపోయి
వాకిట రాటను కట్టిన కవితా కామధేనువు !



Click here to watch Video

తండ్రులు, నాతాతలు, ముత్తాతలు, తత్పితరులు
తెగ తాగిన ఆ నేతుల సౌరభ విభవం
పనికట్టుకు తగలెట్టిన తుదిముట్టని సిగిరెట్లతో
పొగచూరిన నా మూతిన చూడబోతె దుర్లభం!

ఏమని రాయను? ఏముందని రాయను?

బుష్షు గురించా? శ్రేయస్సు గురించా ?
సహజ వైరి సహవాసం కుంభినిలో సంభవమా!
కారుణ్యం గురించా? కాలుష్యం గురించా?
లివింగ్ రూం లెదర్ చైర్, గరాజులో స్పోర్ట్స్ కార్!
యుద్ధ రక్తి గురించా? శాంతి సూక్తి గురించా?
ఆజి మోజు కలవారికి రాజీ నైజం కాదు!
డివైన్ గాడ్ గురించా? డెవిల్ గాడి గురించా?
అనాది పోరాటానికి అర్ధం అంతం లేవు!
సినీమాల గురించా? సీరియళ్ళ గురించా?
భావలేమి నా కవితలతో వదిలేది కాదు!

ఏమని రాయను? ఏముందని రాయను?
పెగిలే గళాన్నే కరాళ కరాలదిమి పడుతున్నాయ్?
రగిలే స్వేచ్ఛాగ్ని కీలలేసంద్రం లో దాక్కున్నాయ్?
ఏ నిర్వేదం నిర్నిద్ర ం అవుతోంది? ఏ నిరాశావాదం నీరసింప చేస్తోంది?

వీటీ, వధూటి, వీణా నిర్గత ఝంఝూటీ,
రాసభ లో చోటూ, రాయంచ 'కాటూ'
లేకుంటేనేం? దరికి రాకుంటేనేం..

కల్తీ ఏ పాలూ లేని అమ్మ అప్యాయత లేదా?
ఏ శక్తీ సరిరాని నాన్న ఆశీ: ప్రశంస లేదా ?
కడదాకా విడువననీ, విడిచెన్నడు నడువననే
సహచరి సహవాసం లేదా? సహయోగం లేదా?
నేను సైతమనే పాట నా హృదిలో మార్మోగడం లేదా?

ఇంకా కావలిక ఏ ధనం?
నా కవితా దీపం వెలిగించే ఇంధనం!

గాలిజాలు తాకిడికి కరిగిపడే నీలి మొయిలు
అలినీ ఝంకారానికి విరిసిపడే పూల హొయలు
వెలదుల వేనలి మొదలు వేల వేదాంతాల సొదలు
పసిపాపల హాసాలు పరమాత్ముడి విలాసాలు
గరళం మోసే గళాలు అసహాయుల అశ్రుకణాలు
ఎన్ని లేవు? నావి కావు?

సుధా జననమవడానికి ఏ మధనానికైన నే సిద్ధమే!
తమస్సుకూ ఉషస్సుకూ వారధికై
ఏ కవితా శర సంధానానికైన సంసిద్ధమే..

కందాళ రమానాథ్ గారు సుజనరంజని పాఠకులకు సుపరిచితులే

# ప్రావాస భారతం

డాక్టర్ సురేంద్ర దారా

సైకత లోయలో విరిసిన తెలుగుపూల సౌరభం
అందరికీ చేరాలని జరుగుతోంది ఈ కవి సమ్మేళనం
ఉరుకులెత్తి పొంగుచుండ  దాగి ఉన్న పాటవం
అవకాశాలను వెతుక్కుంటూ కొందరం
ఆశయ సాధన కోసం మరికొందరం
ఆస్తిపాస్తులు పెంచు కుందామని ఇంకొందరం
ఏదో ఒక రోజున తిరిగి వెళ్ళిపోతాంలే
అన్న తీపి భ్రమతో ఇచటి కొచ్చిన మన మందరం
గొప్ప జాతికి చెందిన ఆంధ్రులం
మాతృభాషాభిమానం మత్తులో మసిలే పాంథులం
కన్న ఊరు వదిలిపెట్టి
మన పొట్టను చేత బట్టి
ఈ దేశం దారి పట్టి
ఇచట వాలిన వలస పక్షులం !
చదువులు నిండిన కుక్షులం !!
యూనివర్సలు స్టూడియోకి వెళ్ళినా
ఊరిలో జరిగే ఉత్సవాలనీ ,
సింఫనీ అర్కెస్ట్రాలకి వెళ్ళినా
సన్నాయి మేళాల శ్రావ్యతనీ ,
ఐమాక్స్ థియేటర్లో ఐస్ కోల్డ్ పెప్సీ త్రాగుతూ
ఐదుపైసలకు ఊరి సినిమాహాలు బయట కొన్న గోలీ సోడానీ ,
మైక్రోవేవ్ అవెన్లో పొంగుతున్న పాప్ కార్న్ బ్యాగుని చూస్తూ



Click here to watch Video

మండే నిప్పులపై చిటపటలాడుతూ కాలుతున్న మొక్కజొన్న పొత్తుల్నీ ,
ఖరీదైన మిల్క్ షేకు త్రాగుతూ
మండుటెండలో రోడ్డు పక్కన త్రాగిన చెరుకు రసాన్ని ,
వెచ్చనైన జకూజీల్లో సేదతీరుతూ
మట్టినీళ్ళ ఏటిలో వేసిన మునకల్నీ ,
ఏసీ కార్లలో ఎక్స్ ప్రెస్ వేలలో పోతున్నా
ఎడ్ల బళ్ళలో ఎగుడు దిగుడు దారుల్లో సాగించిన ప్రయాణాల్నీ ,
గుర్తు తెచ్చుకుని మైమరచి పోవడం మన ప్రకృతి !
అందుకే మనల్ని ఎప్పుడూ వీడనంటుంది తెలుగు సంస్కృతి !!
పిజ్జాల రొట్టెలూ, ఫ్రైడ్ చికెన్ బుట్టలూ
ఐస్క్రీము పెట్టెలూ, బర్గర్ల గుట్టలూ ఎన్నో ఉండొచ్చు కాని ,
కమ్మని పెసరట్టులూ, పుల్లని అట్టులూ
మామిడిపళ్ళ బుట్టలూ, పూతరేకుల చుట్టులూ
వీటికోసమే మనము వేస్తాము ఎల్లప్పుడు లొట్టలు !
అధునాతన యంత్రాలూ
జీవన సమర తంత్రాల నడుమ
మన మదిలొ మెదులుతూ ఉంటాయి
సాగర తీరాన గడిపిన సాయింత్రాలూ ,
దేముడి గుడిలో వినిపించే వేద మంత్రాలూ !
మనమేమో ఇక్కడ మనసు మాత్రం అక్కడ
శ్రీరామనవమి కాగానే వినాయకచవితికి
విజయదశమి రాగానే దీపావళి పండుగకి
సంక్రాంతి పోగానే సంవత్సరాదికి
సంబరాలు జరుపుకోవాలని సంబరపడతాం

పథకాలు వేసుకుంటూ పరుగులు తీస్తాం
తెలుగుదనపు తీపిలో తేలియాడుతుంటాం !
ఇక్కడ ఉండే సుఖసౌఖ్యాలలోని మాధుర్యాన్ని
వాటిని పొందడానికి చిందించిన స్వేదంలోని ఉప్పదనాన్ని
పెరిగే పిల్లల పాశ్చాత్య పోకడలలోని పుల్లదనాన్ని
పరిచయస్తులెంత మంది ఉన్నా అపుడపుడూ లోనయ్యే వంటరితనంలోని
వగరునీ
ఈదేశమొచ్చినా మారని మన అలవాట్ల వల్ల ఒక్కోసారి ఎదురయ్యే
వెట'కారాన్నీ'
అయిన వారికి దూరంగా ఉన్నామన్న నిజంలోని చేదునీ
మేళవించి మనం సాగించే ఈ షడ్రుచుల జీవితం -
ఉగాది పచ్చడిని తలపింపచేసే ప్రవాస భారతం !
ఎందరో మహానుభావులు అందరికీ వందనాలు !!
ఉగాదియని పూస్తున్నా పలుకుల హరి చందనాలు.!!!

డాక్టర్ సురేంద్రగారు బేకర్స్‌ఫీల్డ్ లో ఎంటమాలజీలో పరిశోధన కొనసాగిస్తున్నారు. కథలూ, కవితలూ , పాటలూ వ్రాస్తుంటారు

# మెరుపు కవితలు

గరిమెళ్ళ నాగేశ్వర రావు



పిల్ల మల్లెతీగ
నవ్వు ప్లాస్టిక్ పువ్వు
సేల్స్ గర్ల్

*****



తడారితే
ఎడారే కదా
నేలైనా..మనసైనా!

*****



సర్వం దహించ గలిగీ
ఒదిగి ఉంటుంది
అగ్గిపెట్టెలో పుల్ల

*****



చెత్తని పారేయకు
మంటపెడితే
చంపేస్తుంది చలిని



ఎం.ఎ(తెలుగు) , ఎం.ఎ(ఇంగ్లీషు) చదివిన శ్రీ నాగేశ్వర రావు విశాఖపట్నం దగ్గరలోని కొమ్మాడిలో జవహర్ నవోదయ విద్యాలయం లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయన వ్రాసిన అనేక కథలూ, గేయాలూ, కవితలూ అన్ని ప్రముఖ పత్రికలలోనూ ప్రచురించబడ్డాయి. వీరి పాటలు ఆకాశవాణిలోకూడా ప్రసారమయ్యాయి. ఇంతవరకూ 15 నాటికలు వ్రాసి ప్రదర్శించారు. వీరి కవితలకి పలు బహుమతులు కూడ లభించాయి.